

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి

## వినతులను వెంటనే పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్కావెంజర్ల సంఘం ఆధ్వర్యంలో గతేడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్నామని, గత అక్టోబర్ నుంచి వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామన్నారు. బయ్యారం మండలం గౌరారం గ్రామానికి చెందిన తమకు దళితబంధు పథకం ద్వారా వచ్చిన కొంతమొత్తంతో పౌల్ట్రీ ఫాం నిర్మించుకున్నామని, మిగిలిన డబ్బులను మంజూరు చేయాలని కోరారు. గార్ల మండలానికి చెందిన సక్రు ఉపాధి జాబ్ కార్డ్ మంజూరు చేసి, పని కల్పించాలని వినతి పత్రం అందజేశారు. రెవెన్యూ శాఖకు 31, హౌసింగ్ 08, పంచాయతీ రాజ్ శాఖకు 05, ఇతర శాఖలకు 30 మొత్తం 74 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి..

కేసముద్రం,మే 5 : అనర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అధికారులు మంజూరు చేస్తున్నారని మండలంలోని కాట్రపల్లి తండాకు చెందిన బోడ కవిత సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు భర్త లేడని, ఇద్దరు పిల్లలతో కడు పేదరికంలో జీవిస్తున్నట్లు తెలిపింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదని, వ్యవసాయ భూములు ఉన్న వారికి ఇండ్లు కేటాయించారని ఆరోపించింది. తనకు గుంట భూమి లేదని, కలెక్టర్ సార్ చొరవ తీసుకొని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని వేడుకున్నది.



ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని పిల్లలతో కలిసి అధికారులను వేడుకుంటున్న కవిత

## ఇన్‌స్టాలో మోసం

**రూ.50వేలు మోసపోయిన బాధితుడు**

తొర్రూరు, మే 5 : ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి దుస్తులు ఆర్డర్ చేసి రూ.50వేలు మోసపోయిన ఘటన తొర్రూరులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అమ్మాపురం గ్రామానికి చెందిన సిరిపాటి ముఖేశ్ 5 నెలల క్రితం స్పోర్ట్స్ దుస్తులను కొనుగోలు చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా రూ.50వేలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. అయితే, నాలుగు నెలలు గడిచినా ఆర్డర్ చేసిన వస్తువులు రాకపోవడంతో ముఖేశ్ ఫోన్లు చేయడంతోపాటు మెసేజ్‌లు కూడా చేశాడు. సదరు వ్యక్తి స్పందించకపోవడంతో ముఖేశ్ సోమవారం తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు. సైబర్ క్రైమ్ నేరంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# బస్తాల మాయంపై విచారణ

**కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు**

చిన్నగూడూరు, మే 5 : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ఓ రైతుకు చెందిన 21 బస్తాల ధాన్యం మాయమైన ఘటనలో రెవెన్యూ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామ శివారు దూమ్దాతండాకు చెందిన బానోత్ వీరన్న 20 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. గత నెల 29న హమాలీలు 116 బస్తాల ధాన్యాన్ని కాంటా వేశారు. అనంతరం రెండు రోజుల తర్వాత లారీ లో లోడ్ చేసి వీరన్న ఇంటికి వచ్చాడు. నిర్వాహకులు ఫోన్ చేసి 95 బస్తాలకు ఆన్‌లైన్ చేసామని ఓటీపీ చెప్పమని ఫోన్ చేయడంతో రైతు వీరన్న కంగుతిన్నాడు. వెంటనే కొనుగోలు కేంద్రానికి చేరుకొని హమాలీలు కాంటావేసి నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించగా 116 బస్తాలు కాంటా వేసినట్లు ఉంది. దీంతో వీరన్న స్థానిక రైతులతో కలిసి ఆందోళన చేపట్టాడు. తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఆర్ఐ మాతంగి వందన కొనుగోలు కేంద్రంలో సోమవారం విచారణ చేపట్టారు.



కొనుగోలు కేంద్రంలో విచారణ చేస్తున్న వందన

# భూ భారతితో రైతులకు మేలు

దంతాలపల్లి, మే 5 : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టం–2025ని తీసుకొచ్చిందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్ అన్నారు. భూ భారతి చట్టంలో భాగంగా దంతాలపల్లి మండలం పైలట్‌గా ఎంపిక కాగా, సోమవారం పెద్దముప్పారం, ఆగపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూభారతి చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేశ్, తహసీల్దార్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కోమాలి, నాగరాజు, ఆర్ఐలు నజీమొద్దీన్, బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రూనాయక్

**రెవెన్యూ సదస్సులు పరిశీలించిన కలెక్టర్**

మండలంలోని పెద్దముప్పారం, ఆగపేట గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను సోమవారం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ పరిశీలించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించే పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. సదస్సుకు వచ్చే రైతులు, ప్రజల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేశ్, తహసీల్దార్ అనీల్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ నజీమొద్దీన్ పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య**

కురవి(సీరోలు), మే 5 : లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతుగంటి మల్లయ్య అన్నారు. సోమవారం సీరోలు గ్రామంలో సీఐటీయూ గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత 11 సంవత్సరాల నుంచి కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా మార్చి అమలు చేస్తుందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నాయన్నారు. లేబర్ కోడ్‌లు ఉపసంహరించే వరకు పోరాటం ఆగదన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు తగర ముత్తయ్య, ఉపాధ్యక్షుడు కొమ్ము ఉపేందర్, బేగం, నాగన్న, ధరావత్ నగేశ్‌నాయక్, కసనబోయిన రమేశ్, లావుడియా లాక్య, రేణుక, గంగారపు వెంకన్న, రామలింగయ్య, రేణుక, ప్రభాకర్, గంగారపు వెంకన్న, రమణ, సులోచన పాల్గొన్నారు.

**పోరాటాలతోనే సమస్యల పరిష్కారం**

కురవి, మే 5 : పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సీపీఐ అయ్యగారిపల్లి గ్రామ శాఖ సమావేశం పిచ్చయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో మును పెన్నడూ లేనివిధంగా దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. మోదీ అవలంబించిన కార్పొరేట్ అనుకూల విధానాలతో దేశ సంపద ఆవిరవుతున్నదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్య పెరిగినా, రైతులు సంక్షేమంలో కూరుకుపోయినా పట్టించుకోని ప్రభుత్వాలకు కనువిప్పు కలుగాలంటే ప్రజా పోరాటాలే మార్గమన్నారు. బొల్లు వెంకన్నను గ్రామ కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా గజ్జి చంద్రయ్యతోపాటు ఏడుగురితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్తూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేశారు. మండల కార్యదర్శి కరణం రాజన్న, సహాయ కార్యదర్శి సమ్మయ్య, నాగరాజు, నర్సింగం గురవయ్య , యాకయ్య, బుడిగ పిచ్చయ్య, తాడబోయిన యాకన్న, వీరయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి

గంగారం, మే 5 : రోడ్డు ప్రమాదంలో బీఎస్‌ఎఫ్ జవాన్ మృతి చెందిన ఘటన మండలంలోని అందులగూడెంలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అందులగూడేనికి మద్దెల ప్రకాశ్(34) బీఎస్‌ఎఫ్ జవాన్‌గా జమ్ము కాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సెలవులపై కొద్ది రోజుల క్రితం ఇంటి వచ్చిన ప్రకాశ్ ఆదివారం కొత్తగూడ మండలం గోవిందపురంగ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా, పెగడపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టాడు. బంధువులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకున్నది. ప్రకాశ్‌కు భార్య అనిత ఉన్నారు.



ప్రకాశ్(ఫైల్)

## గంట్లకుంటలో శతాధిక వృద్ధురాలు..

పెద్దవంగర, మే 5 : శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన బొల్లం లింగమ్మ వృద్ధాప్యంతో మృతి చెందింది. గ్రామంలో అతి పెద్ద వయస్కురాలు కావడంతో చాలా మంది గ్రామస్తులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు.



లింగమ్మ (ఫైల్)

## వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ..

గార్ల, మే 5 : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలకేంద్రంలోని అంబేద్కర్ బజార్‌కు చెందిన ఉపాధి హామీ కూలీ అక్కి పార్వతి(51) సోమవారం వడదెబ్బతో మృతి చెందింది. కూలీ పనికి వెళ్లి అస్వస్థతకు గురికావడంతో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి ఇంటి వద్ద తహసీల్దార్ శారద, గార్ల ఎస్సై రియాజ్ పాషా, సీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్ వివరాలు తెలుసుకున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీ

తొర్రూరు : ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ జరిగిన ఘటన తొర్రూరు మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నాంచారిమడూర్ గ్రామానికి చెందిన బానోత్ భిక్షం తండ్రి చంద్రు భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దాదాపు రూ.15వేల విలువ చేసే కాపర్‌వైర్‌ను దుండగులు అపహరించారు. అసిస్టెంట్ ఏఈ మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## సద్వినియోగం చేసుకోవాలి

మరిపెడ, మే 5 : సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గాదె అనితాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జిల్లా ప్రజాపరిషత్ సీతారాంపురం, మరిపెడ, ఎల్లంపేట, గుండెపుడి ప్రభుత్వ పాఠశాలలో 20 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

మరిపెడ : అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని మరిపెడ పురపాలక సంఘం కమీషనర్ కే నరేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, పన్నులను పురపాలక సంఘం కమీషనర్ పేరుతో 8247649631 ఫోన్ నంబర్, లేదా ఇతర నంబర్ల నుంచి క్యూఆర్ కోడ్ పంపిస్తే స్పందించొద్దన్నారు. ఇంటి పన్నులు, ఇతర పన్నులు వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లకు మాత్రమే చెల్లించాలన్నారు.

## బస్టాండులో చలివేంద్రం ప్రారంభం

కురవి, మే 5 : కురవి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ సోమిశెట్టి శ్రీనివాస్ తండ్రి సోమిశెట్టి వీరభద్రం జ్ఞాపకార్థం కురవి బస్టాండులో మే, జూన్ రెండు నెలల కోసం సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేయగా, మహబూబాబాద్ ఆర్టీసీ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ గోపు శ్రీనివాస్ ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం మంచి హృదయంతో ముందుకు వచ్చిన దాత శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర నాగేశ్వరరావు, మోహన్‌రావు, దైద భద్రయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, బాదె వీరభద్రం, తోట వెంకన్న, బాదె సైదులు, కన్నె వెంకన్న, మాచర్ల ఉప్పలయ్య, ఆర్టీసీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

## వేదపండితుడికి శృంగేరి పీఠం సత్కారం

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో వేద పండితుడిగా పనిచేస్తున్న బాలకృష్ణశర్మ ఆరాధ్యుల కర్నాటకలోని శృంగేరి శారదాపీఠాధికారి భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీస్వామి చేతులమీదుగా శుక్లయజుర్వే విద్వాన్‌గా సత్కారం అందుకున్నారు. ఈ నెల 3న కర్నాటకలోని శృంగేరి పీఠంలో రాజముద్రిక ఉన్న సువర్ణ ఉంగారాన్ని, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, ఉద్యోగులు అభినందించారు.

## ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

తొర్రూరు :ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనుభవమున్న అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతున్నదని తొర్రూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో సౌకర్యాలు, గ్రూపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలలో ఉచిత పుస్తకాలు, రుసుముల మినహాయింపు వంటి సౌకర్యాలు ఉన్నాయని, ఎం పీ సీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ ఈటీ, ఎలక్ట్రికల్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణ, మల్లయ్య, ఉప్పలయ్య, నరసయ్య, శివరామకృష్ణ, రాజేశ్‌కుమార్, నాగరాజు, కమల్‌దీప్ పాల్గొన్నారు.

## కస్తూర్బాలో వేసవి శిక్షణా శిబిరం

గూడూరు, మే 5 : వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలోని కస్తూర్బాలో జిల్లాలోని అన్ని కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న అనాథలైన బాలికలకు 15 రోజుల ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సగ్రమ శిక్షణా విధానంలో భాగంగా ఈ నెల 20 వరకు మ్యూజిక్, డ్యాన్స్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితంలో మెళకువలు, కంప్యూటర్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో విజయకుమారి, ఎస్‌వో సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మెపా' మండల కమిటీ

కొత్తగూడ, : ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) కొత్తగూడ మండల అధ్యక్షుడిగా అల్లాడి రాజుముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా హంస వెంకట్‌నారాయణ, ఉపాధ్యక్షుడిగా చొప్పరి కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల హక్కుల కోసం మెపా కృషి చేస్తుందని, విద్య, ఉద్యోగ సాధికారిత కోసం మెపాను స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుండి అశోక్, ప్రధాన కార్యదర్శి జెట్టి యాకయ్య, యాకాంబ్రం, కొక్కు సంపత్, గుంటుక నరేశ్, చాగంటి అశోక్, వీరన్న, నారాయణ పాల్గొన్నారు.


## పోలీసు స్టేషన్‌కు ఫ్రిడ్జి అందజేత

నెల్లికుదురు, మే 5: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ధర్మతండాకు చెందిన బానోత్ నర్సింహ రూ.10వేల విలువ చేసే ఫ్రిడ్జి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్సై శివరామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి..

**భార్య మృతి.., భర్తకు తీవ్రగాయాలు**

గార్ల, మే 5 : సీతారామ ప్రాజెక్టు కాల్వలో పడి భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గార్ల రోడ్డులో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం నమిలిపురి గ్రామానికి చెందిన సపావట్ బావ్‌సింగ్, సపావట్ విజయ భార్యాభర్తలు. ఇద్దరూ బైక్‌పై తిర్లాపురంలో తమ బంధువుల ఇంటికి వస్తూ.., డోర్నకల్ నుంచి గార్ల వైపు వెళ్లే దారిలో సీతారామ కాల్వ ప్రాజెక్టు కాల్వలో పడ్డారు. ఈ ప్రమాదంలో భార్య విజయ (40) అక్కడిక్కడే మృతి చెందగా, భర్త భావ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.. ప్రథమ చికిత్స అనంతరం మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు.



గాయపడిన బావ్‌సింగ్

## పైపులైన్‌కు మరమ్మతు చేయించాలి

మహబూబాబాద్ రూరల్ : భగీరథ పైపులైన్లకు వెంటనే మరమ్మతు చేయించాలని సీపీఎం నాయకులు ఎండీ రజాక్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో లీకైన పైపులైన్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని శివారు కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా కాక కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రెండు నెలలుగా బేతోలు మెయిన్ రోడ్డు వద్ద పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

## కేంద్రం రైతులను విస్మరించింది..

మహబూబాబాద్ రూరల్, మే 5 : కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్నచంద్రన్న అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలుగా రైతుల సమస్యలను అసలే పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్తనాలను సకాలంలో అందించాలన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే నిరసనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పైండ్ల యాకయ్య, పాపారావు, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

## 7న జాబ్ మేళా

మహబూబాబాద్ రూరల్, మే 5 : ఎంఆర్‌ఎఫ్ హైదరాబాద్ సంస్థలో పని చేసేందుకు ఈ నెల 07న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానిఫ్యాక్చరింగ్ ఆపరేషన్ పోస్ట్‌కు పది, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన వారికి అవకాశం ఉందని, 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు గలవారు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.17,500 అని, ఆసక్తి గల వారు 8886289267 నంబరులో సంప్రదించాలన్నారు.

## ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

మహబూబాబాద్ రూరల్ : రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త మాలతి సూచించారు. సోమవారం పట్టణంలోని ఏటిగడ్డ తండా రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. పంట మార్పిడి వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. వాణిజ్య పంటలతోపాటుగా ఆయిల్‌పామ్, కూరగాయల పంటలు చేయాలన్నారు. పంటల్లో అన్ని రకాల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏడీఏ శ్రీనివాసరావు, శాంతిప్రియ, రంజిత్, సాయిప్రకాశ్, పూజిత, పున్నమి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

కురవి : మోద్దులగూడెం శివారు బేగావత్ తండా గ్రామంలో గ్రీన్ ఫీల్డ్ హైవేపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ తండావాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం కొనసాగాయి. మాజీ ఎంపీటీసీ బాలాజీ మాట్లాడుతూ.. ఇన్ని రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వంతెన నిర్మించే వరకు పోరాటం ఆగదన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తొర్రూరు మండలంలోని హైస్కూల్‌లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బుచ్చయ్య తెలిపారు. సోమవారం ఎంఈవో కార్యాలయంలో హెచ్ఎంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి 20 వరకు వేసవి శిక్షణ తరగతులు ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 10.30గంటలకు ఉంటాయని, స్పోకెన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, డ్రాయింగ్, ఆటలు, డ్యాన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి పలు అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు తుమ్మ వెంకటేశ్వర్లు, జెల్ల లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, సంజయ్, రవి పాల్గొన్నారు.

## నేటి నుంచి సమ్మర్ క్యాంపులు

కురవి : సీరోలు, కురవి మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో నేటి నుంచి వేసవి శిక్షణ తరగతుల (సమ్మర్ కోచింగ్) క్యాంపులు 15 రోజులపాటు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు బాలాజీ, లచ్చిరాం సోమవారం తెలిపారు. కురవి మండల కేంద్రంతోపాటు రాజోలు, మోద్దుగలగూడెం, సీరోలు మండల కాంపల్లి హైస్కూల్‌లో ఈ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. నాలుగో తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులు హాజరుకావాలన్నారు.

## రామారావు స్ఫూర్తి తో పనిచేద్దాం

గూడూరు, మే 5 : అరుణోదయ కళాకారుడు రామారావు స్ఫూర్తితో పనిచేద్దామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం పిలుపునిచ్చారు. సోమవారం రామారావు స్మారక సభను మండలంలోని జగన్నాయకులగూడెంలో నిర్వహించారు రామారావుకు నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రమ దోపిడీ చేసే శక్తులకు వ్యతిరేకంగా తమ గొంతును వినిపించే అనేక మంది కళాకారులను రామారావు తయారు చేశాడని, పేదల పక్షాన, దోపిడీకి గురైన ప్రజల పక్షాన గొంతును విప్పి సమాజంలో చైతన్యం తీసుకొచ్చాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య, మురళీకృష్ణ, లింగన్న, అచ్చన్న, పుల్లన్న, వీరభద్రం, భరత్, తిరుపతక్క, పద్మ, వెంకన్న, భిక్షం, సురేందర్, యాదగిరి, సోమన్న, బుచ్చిరాములు, యాకన్న, దేవేందర్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

గంగారం, మే 5 : రైతుల సమస్యలను పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలని జిల్లా అఖిల భారత ఐక్య రైతు సంఘం అధ్యక్షుడు పూణేం ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన ఈ నెల 8న తలపెట్టిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకిచ్చిన హామీలను విస్మరించాయన్నారు. పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని చేపట్టనున్న ధర్నాకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు ఈక భిక్షం, కురసం రంగయ్య, నాగేశ్వరావు, రామయ్య, బుచ్చిరాములు పాల్గొన్నారు.

## గడ్డి మోపులు దగ్ధం

నెల్లికుదురు, మే 5 : నిప్పంటుకొని గడ్డి మోపులు దగ్ధమైన ఘటన నెల్లికుదురు మండలకేంద్రంలో జరిగింది. బాధితుడు కాలమల్ల వెంకన్న కథనం ప్రకారం... వెంకన్న తన ఇంటి వద్ద గడ్డి కట్టలను నిల్వ చేశాడు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో సుమారు 80 గడ్డి మోపులు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

## 12 ఓంకార్ శతజయంతి సభ

గూడూరు, మే 5 : ఈ నెల 12న తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు ఓంకార్ శతజయంతి సభ నిర్వహిస్తున్నట్లు ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శులు కంచ వెంకన్న, నూకల ఉపేందర్ తెలిపారు. సోమవారం శతజయంతి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. తాడిత, పీడిత జనం కోసం పోరాటం చేసి రైతుల కోసం వారి హక్కుల కోసం పోరాడి శాసనసభలో గొంతెత్తిన నాయకుడు ఓంకార్ అని అన్నారు. వరంగల్ జిల్లా మచ్చాపూర్ గ్రామంలోని ఆయన స్తూపం వద్ద సభ నిర్వహిస్తున్నామని, అభిమానులు, మేధావులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, బుచ్చిరామయ్య, సత్తయ్య, చంద్రయ్య, సత్యం పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Urgent requirement for ICICI, HDFC, AXIS INDUSIND BANK'S LOANS. DSA EXP. & FRESHER FEMALE TELE-CALLERS SAL.+INC.etc... JOB LOCATION: HNK CONT: +91 9182172367.
NTW-7711

CHANGE OF NAME
★I, ALLAM SANDEEP S/o ALLAM LACHAIAH R/o H. No. 1-42, Shayampet Haveli, Geesugonda Mandal, Warangal Dist., have changed my name from ALLAM SADANANDAM to ALLAM SANDEEP for all Purposes.
NTW-000

CHANGE OF NAME
★I, the undersigned GAYYI NARAYANA has changed my name from GAYYI NARAYANA (Old Name) to GAI NARAYANA (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17619

CHANGE OF NAME
★I, the undersigned GAYYI SULOCHANA has changed my name from GAYYI SULUOCHANA (Old Name) to GAI SULOCHANA (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17621

CHANGE OF NAME
★I, the undersigned GAYYI NARESH BABU has changed my name from GAYYI NARESH BABU (Old Name) to GAI NARESH BABU (New Name) for all purposes and I am residing at H No 2-7-454, Excise Colony, Waddepally, Hanamkonda, Hanumakonda District-506370 T.G., India, and solemnly declare.
NTW-17620

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565